సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



రూ.లక్ష విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి గుడుపూడి హరి వెంకట నారాయణమూర్తి (విశాఖపట్నం) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.




గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు వేళాయె

గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశంతో పాటు, 6,7,8 తరగతుల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. - 8లో ▸

డెల్టాలకు 7,405 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 7,405 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,185, మధ్య డెల్టాకు 1,420, పశ్చిమ డెల్టాకు 3,800 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.10 అడుగులకు చేరింది.



న్యూస్‌రీల్

కిక్కిరిసిన విఘ్నేశ్వరుని ఆలయం



విఘ్నేశ్వస్వామికి లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తున్న పండితులు

అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ప్రధానార్చకుడు అయిన విల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యాన స్వామి వారికి విశేష పూజలు చేశారు. గరిక పూజ నిర్వహించారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో భక్త దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నూతన వాహనాలకు పలువురు పూజలు చేశారు. స్వామి వారికి ప్రత్యేక దర్శనం ద్వారా రూ.22 వేలు, అన్నప్రసాదాల విరాళాలుగా రూ.85 వేలు, వివిధ సేవలకు రూ.15 వేలు, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.34 వేలు, ఇతర విరాళాలుగా రూ.20 వేలు కలిపి మొత్తం రూ.1.76 లక్షల ఆదాయం సమకూరిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు వివరించారు.

వేంకటేశ్వర స్వామిని ప్రతి ఒక్కరూ సేవించాలి



బాల బ్రహ్మానంద స్వామీజీని సత్కరిస్తున్న చైర్మన్ రామకృష్ణ

మామిడికుదురు: ప్రతి ఒక్కరూ వేంకటేశ్వర స్వామిని సేవించాలని నైమిశారణ్య పీఠాధిపతి శ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి స్వామీజీ అన్నారు. 'శ్రీ వేంకటేశ్వర తత్వం – పురాణ విజ్ఞానం' అనే అంశంపై ఆయన అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి ఆలయంలో ఆదివారం సుదీర్ఘ ప్రవచనం చేశారు. అనంతరం స్వామిజీని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంకేటీ నాగవరప్రసాద్, ట్రస్టు బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ ఘనంగా సత్కరించారు. ముందుగా ఆలయానికి చేరుకున్న స్వామిజీకి అర్చకులు ఘన స్వాగతం పలికారు. ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీను, బత్తుల విజయ గంగారత్నం, కొమ్ముల సూరిబాబు, బొరుసు పార్వతీ దుర్గాభవాని పాల్గొన్నారు. కాగా, స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.లక్ష ఆదాయం సమకూరాయి. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.63,750, నిత్యాన్నదానం ట్రస్టుకు విరాళాలుగా రూ.36,264 వచ్చాయి. 1,792 మంది భక్తులు స్వామిని దర్శించుకోగా, 1,368 మంది అన్న ప్రసాదం స్వీకరించారు.

ఆలయ పునర్నిర్మాణానికి 120 అడుగుల క్రేన్



తుని రూరల్: లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారి ప్రధానాలయం పునర్నిర్మాణానికి 120 అడుగుల భారీ క్రేన్ ఏర్పాటు చేశారు. దీని ఏర్పాటు పనులను దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు, మాజీ చైర్మన్ దూలం మాణిక్యం, ధర్మకర్తలు కొబ్బరి కాయలు కొట్టి ఆదివారం చేపట్టారు. ఆలయ పునర్నిర్మాణంలో ఉపయోగిస్తున్న కృష్ణశిలలను మూడో ఘాట్ రోడ్డు వరకూ తరలించారు. అక్కడి నుంచి వాటిని కొండ పైకి మనుషులతో తరలించడం సాధ్యం కాలేదు. దీంతో తొలుత వాటిని జేసీబీలతో తరలించాలని భావించారు. ఇప్పటికే ఉన్న మండప శిఖరం అడ్డం వస్తూండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో భారీ క్రేన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు హైదరాబాద్ నుంచి రప్పించిన 120 అడుగుల క్రేన్ ఏర్పాటుకు పూజలు చేశారు. దీని ఏర్పాటు పనులను రెండు రోజుల్లో పూర్తి చేస్తారు. అనంతరం ఈ క్రేన్ సహాయంతో కృష్ణశిలలను ప్రధానాలయానికి తరలిస్తామని ఈఓ తెలిపారు. ఈ క్రేన్‌తో కృష్ణశిలలను తరలించడం అత్యంత ప్రమాదకరమైన ప్రక్రియని ఆయన చెప్పారు. శిలలను తరలించేందుకు ప్రత్యామ్నాయ మార్గం లేదని తెలిపారు. పనులు సజావుగా పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామని అన్నారు.

ప్రగతి రాగం.. పల్లవించే వేళ..

విశాఖ నగరాభివృద్ధి సంస్థ (వుడా) ఆధ్వర్యాన అక్కడ వుడా పార్కు, వుడా చిల్డ్రన్స్ థియేటర్ వంటివి ఏర్పాటు చేయడమే కాకుండా కైలాసగిరిని పర్యాటకంగా తీర్చిదిద్దారు. ఇంకా, మధ్యతరగతి, అల్పాదాయ వర్గాల వారి సొంతింటి కలను సాకారం చేసేందుకు అనేక గృహ నిర్మాణ ప్రాజెక్టులు చేపట్టారు. 'అముడా' ద్వారా ఇటువంటి అనేక ప్రయోజనాలు అమలాపురం ప్రాంతానికి సమకూరనున్నాయి.

- 'అముడా'తో అభివృద్ధి కొత్త పుంతలు
- ప్రణాళికాబద్ధంగా పట్టణాభివృద్ధి
- మెరుగైన పౌర సదుపాయాలు సమకూరే అవకాశం



అమలాపురం గడియారం స్తంభం సెంటర్

సాక్షి డెస్క్, రాజమహేంద్రవరం: అచ్చ తెలుగు సంస్కృతికి, ఆధ్యాత్మికతకు, గుండె లోతుల్లోంచి నిండు గోదారిలా పొంగి పొరలే ఆదరాభిమానాలకు కోనసీమ పెట్టింది పేరు. రాష్ట్రంలో ఆ మాటకొస్తే దేశవిదేశాల్లో సైతం పేరు ప్రఖ్యాతులు పొందిన ఈ గడ్డ అందుకు తగ్గ రీతిలో అభివృద్ధికి నోచుకోని దుస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో ఈ సీమను ప్రత్యేక జిల్లాగా చేసి ప్రగతి పథంలో పదింతలు ముందుకు తీసుకువెళ్లిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానిదే. గత ఏడాది ఉగాది కానుకగా కోనసీమ జిల్లాను ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈసారి ఉగాదికి అమలాపురం పట్టణాభివృద్ధి సంస్థ (అముడా) ఏర్పాటు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. కార్యాలయం, పాలకవర్గం ఏర్పాటు, అధికారులు, సిబ్బంది నియామకం వంటివి త్వరలోనే జరుగుతాయి. దీని ద్వారా ఈ ప్రాంతంలో ముఖ్యంగా అమలాపురం చుట్టుపక్కల పట్టణీకరణ ప్రణాళికాబద్ధంగా జరగడానికి, పల్లెలు మరింతగా అభివృద్ధి చెందడానికి మార్గం సుగమమైంది.

పెరుగుతున్న జనసాంద్రత

జిల్లా జనాభా 2011 జనాభా లెక్కల ప్రకారం 17.19 లక్షలు. కోవిడ్ కారణంగా 2021లో జనగణన జరగలేదు. దశాబ్దానికి పైగా గడచిన కాలంతో పోలిస్తే ప్రస్తుతం జిల్లా జనాభా 19 లక్షలకు పైగా ఉంటుందన్నది అధికారిక అంచనా. మరోపక్క వ్యవసాయం, ఉద్యానం, ఆక్వా వంటి కార్యకలాపాల కారణంగా జిల్లాలోని ఒక మోస్తరు మండల కేంద్రాలు కూడా చిన్న సైజు పట్టణాలను తలపిస్తాయి. దీంతో ఇక్కడ జనసాంద్రత కూడా అధికం. సెన్సస్ ఇండియా లెక్కల ప్రకారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జనసాంద్రత 2001లో చదరపు కిలోమీటరుకు 308 కాగా, 2011లో 477కు చేరింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రస్తుతం ఇది 716గా ఉంది. కోనసీమలోని చాలా ప్రాంతాల్లో జనసాంద్రత ఇదేవిధంగా ఉంది.

ప్రగతి 'దారుల' పయనం

- జిల్లాగా ఆవిర్భవించక ముందే కోనసీమ ప్రాంతానికి అమలాపురం ముఖ్య కేంద్రంగా ఉంది. ఈ పట్టణం అభివృద్ధి కొన్నాళ్లుగా వేగంగా జరుగుతోంది. కొత్త జిల్లా ఆవిర్భవించిన తరువాత జిల్లా కేంద్రం కావడంతో అమలాపురం విస్తరణ మరింత జోరందుకుంటోంది.
- అమలాపురం చుట్టుపక్కల ఒకప్పుడు విసిరేసినట్టుగా ఉన్న చాలా గ్రామాలు ఆ పట్టణంతో దాదాపు కలిసిపోయాయి. జనాభా పెరుగుదలకు అనుగుణంగా పట్టణం విస్తరించడంతో చుట్టుపక్కల ఉన్న సమనస, భట్నవిల్లి, బండారులంక, కామనగరువు, ఈదరపల్లి, పేరూరు, రోళ్లపాలెం వంటి గ్రామాలు ప్రస్తుతం అమలాపురంలో దాదాపు ఒక భాగంగా మారిపోయాయి.
- మరోపక్క రోడ్డు కనెక్టివిటీ పెరగడంతో అమలాపురానికి కాస్త దూరంగా ఉన్న గ్రామాలు కూడా వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఉదాహరణకు అంబాజీపేట మండలం గంగలకుర్రు, జనుపల్లి, బోడసకుర్రు తదితర గ్రామాల్లో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఆ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంటోంది.
- ఈదరపల్లి రోడ్డు విస్తరణ తరువాత ప్రగతి వేగం మరింత పెరిగింది.
- అలాగే ప్రస్తుతం 216 జాతీయ రహదారి విస్తరణతో పాటు, కాకినాడ – కోటిపల్లి – నర్సాపురం రైల్వే లైను నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇవి పూర్తయితే అమలాపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో అభివృద్ధి మరింత వేగవంతం కానుంది.
- కనీస సౌకర్యాలు కూడా లేకుండా వెంచర్లు వేసి, తప్పుడు డాక్యుమెంట్లతో అమ్మేసి, సామాన్యులను మోసం చేసే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కూడా 'అముడా' వల్ల అడ్డుకట్ట పడనుంది. నిబంధనల ప్రకారం సువిశాలమైన రోడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించకుంటే లే అవుట్లకు అనుమతులు ఇవ్వరు. అలాగే, నిబంధనలు ఉల్లంఘించి ఇష్టానుసారం భవనాలు నిర్మించే వీలు కూడా ఉండదు. వీటన్నింటి వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలకు మేలు జరగనుంది.

'అముడా' ఏర్పాటుతో..

కనీస సౌకర్యాలకూ నోచకో.. ఉన్న ఊళ్లో బతుకు బరువయ్యో.. ఉద్యోగాలు, ఉపాధి కోసమో.. చిరు వ్యాపారాలతో జీవనం సాగించాలనో ఆశతోనో.. కనీసం తరువాతి తరానికైనా మంచి జీవితం అందించాలనే కాంక్షతోనో.. పల్లె జనం పట్టణాలు, నగరాల బాట పడుతున్న చిత్రం ప్రతి నిత్యమూ ఆవిష్కృతమే. పెరుగుతున్న జనసాంద్రతకు అనుగుణంగా క్రమపద్ధతిలో విస్తరించక.. పట్టణాల్లోని చాలా ప్రాంతాలు అసౌకర్యాలకు నిలయాలుగా మారిపోతున్నాయి. అమలాపురం పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇటువంటి దుస్థితి కలగకుండా చూసేందుకు 'అముడా' దోహదపడనుంది. దీని ఏర్పాటుతో అమలాపురం మున్సిపాలిటీ, ముమ్మిడివరం నగర పంచాయతీతో పాటు 11 మండలాల్లోని 120 రెవెన్యూ గ్రామాలను ఇకపై ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు మార్గం సుగమమైంది. ఈ ప్రాంతంలో రానున్న కాలంలో జరిగే జనాభా పెరుగుదలను అంచనా వేస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే వీలు కలగనుంది. ఇక్కడి ప్రజలకు సువిశాలమైన రోడ్లు, ఇతర పౌర సదుపాయాలు సమకూరే అవకాశం ఏర్పడనుంది.

అందరూ స్వాగతించాలి



అక్రమ లే అవుట్లు, అనుమతులు లేకుండా ప్లాట్లు అమ్మేయడం, ప్లాట్ల రిజిస్ట్రేషన్లలో జరుగుతున్న మోసాలకు అముడా ద్వారా పూర్తిగా అడ్డుకట్ట పడుతుంది. అక్రమ లే అవుట్లతో అటు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, ఇటు సామాన్య ప్రజల సొంతిళ్ల కోరిక పేరుతో కనీస సౌకర్యాలు లేకుండా అరచేతిలో స్వర్గాన్ని చూపించి కొందరు రియల్టర్లు పాల్పడే మోసాలకు కూడా అముడా క్లెం వేయనుంది. అముడా వల్ల లే అవుట్లు, దాని పరిధిలోకి వచ్చే భవనాల ప్లాన్ అప్రూవల్స్ ఇక నుంచి పారదర్శకంగా ఉంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మంజూరయ్యే గృహ నిర్మాణాలు కూడా వేగవంతమవుతాయి. సొంతిళ్ల కోసం అప్పోసొప్పో చేసి, లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసే వారంతా స్వాగతించాల్సిన సందర్భం ఇది.

– కుడుపూడి అశోక్, న్యాయవాది, అమలాపురం

నేడు యథాతథంగా స్పందన

అమలాపురం రూరల్: జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల, గ్రామ సచివాలయ స్థాయిల్లో సోమవారం స్పందన కార్యక్రమాలు యథాతథంగా జరుగుతాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, ఆర్డీఓతో పాటు మండల కార్యాలయాల్లో అర్జీదారుల నుంచి ఉదయం 10 గంటల నుంచే అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తారని వివరించారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో మాత్రం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విజ్ఞాపనలు స్వీకరిస్తారని తెలిపారు. జిల్లా స్థాయి సమస్యలను కలెక్టరేట్ స్పందనకు, డివిజన్ స్థాయివి ఆర్డీఓ కార్యాలయ స్పందనకు, మండల పరిధిలోని సమస్యలను మండల స్థాయి స్పందనకు, గ్రామ/వార్డు స్థాయి సమస్యలను గ్రామ/వార్డు సచివాలయ స్పందనకు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

కోటసత్తెమ్మ వారికి రూ.1.60 లక్షల ఆదాయం

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసి యున్న కోటసత్తెమ్మ అమ్మవారికి ఆదివారం వివిధ రూపాల్లో రూ.1,60,501 ఆదాయం సమకూరింది. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి, పూజలు నిర్వహించామని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు. భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రామసుబ్బరాయశాస్త్రి, ధర్మకర్తల మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తలుపులమ్మ సన్నిధిలో రద్దీ

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థాన ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆదివారం తెల్లవారుజాము నుంచీ పెద్ద సంఖ్యలో భక్తులు లోవకు చేరుకున్నారు. 14 వేల మంది భక్తులు క్యూలో అమ్మవారిని దర్శించుకున్నట్టు కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. పులిహోర, లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,87,815, పూజా టిక్కెట్లకు రూ.1,57,750, తలనీలాలకు రూ.9,925, వాహన పూజలకు రూ.8,410, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెల రూపేణా రూ.84,100, దాతల విరాళాలుగా రూ.92,807 కలిపి రూ.5,40,807 ఆదాయం సమకూరిందని వివరించారు. వసతి గదులు లభించని భక్తులు ఆలయ ప్రాంగణంలో చెట్ల కింద, ఘాట్ రోడ్డు దిగువన ప్రైవేటు పాకల్లోను వసతి ఏర్పాటు చేసుకుని వంటలు, భోజనాలు చేశారు.

మెరిసేలా.. మురిసేలా..



అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలు ఈ నెల 30న ప్రారంభం కానున్నాయి. గతం కంటే మిన్నగా నిర్వహించేందుకు ఈసారి రూ.70 లక్షలతో ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుద్దీపాలంకరణకు రూ.22.5 లక్షల అంచనాతో టెండర్ పిలవగా 7.5 శాతం తక్కువకు ఖరారైంది. ఈసారి విద్యుద్దీపాలంకరణ బాగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని డీఈ సూర్యనారాయణ తెలిపారు. ప్రతిసారీ స్వామివారి కల్యాణంలో తలంబ్రాలుగా మిల్లులో తయారైన బియ్యాన్ని వాడేవారు. ఈసారి తలంబ్రాలుగా గోటితో ఒలిచిన బియ్యం ఉపయోగించనున్నారు. భక్తులు 15 రోజుల ముందు నుంచే గోటి తలంబ్రాల తయారీలో పాల్గొనాలని అధికారులు కోరుతున్నారు. పందిర్లు వేసే పనులు నాలుగు రోజుల్లో పూర్తవుతాయని అధికారులు తెలిపారు.

కల్యాణోత్సవాల క్రమమిదీ..

- ఏప్రిల్ 30: సాయంత్రం 4 గంటలకు అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని, సత్యదేవుడిని వధూవరులుగా అలంకరిస్తారు.
- మే 1: రాత్రి 9 నుంచి 11.30 గంటల వరకూ నూతన కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్ల దివ్యకల్యాణ మహోత్సవం.
- మే 2: ప్రధాన స్థాలీపాక హోమాలు. రాత్రి 7 గంటలకు అరుంధతీ నక్షత్ర దర్శనం.
- మే 3: మధ్యాహ్నం 2.30 గంటలకు అనివేటి మండపంలో పండిత సదస్యం.
- మే 4: సాయంత్రం 5 గంటలకు కొండ దిగువన దేవస్థానం ఉద్యానవనంలో సత్యదేవుని వనవిహారోత్సవం.
- మే 5: ఉదయం 8.30 గంటలకు పంపా నదిలో స్వామివారి శ్రీచక్రస్నానం. సాయంత్రం 4 గంటలకు రత్నగిరిపై అనివేటి మండపంలో నీలలోహిత గౌరీపూజ, నాకబలి, దండియాడింపు, ధ్వజావరోహణం, కంకణ విమోచన.
- మే 6: రాత్రి 7 గంటలకు నిత్య కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లకు శ్రీపుష్పయాగం.

సన్ డే

- తారెత్తించిన సూరీడు
- ఉమ్మడి జిల్లాలో పెరిగిన ఉష్ణోగ్రతలు
- రాజమహేంద్రవరంలో అత్యధికంగా 41 డిగ్రీలు



ఎండ తీవ్రతకు ప్రయాణికుల జాడ లేని పాశర్లపూడి – బోడసకుర్రు వంతెన

సాక్షి, అమలాపురం: మార్తాండుడు చండప్రచండంగా చెలరేగుతూ.. నింగి వీధుల నుంచి అగ్గిరవ్వలు కురిపిస్తున్నాడా అన్నట్టుగా మండిపోతున్నాయి. ఉదయం పది గంటల నుంచే ఎండలు తారెత్తిస్తున్నాయి. మిట్టమధ్యాహ్నం అయితే చాలు సెగలు పుట్టిస్తున్నాయి. బయటకు అడుగు పెడితే వేడి గాలులు ఒంటిపై మంటలు రేపుతున్నాయి. వేసవి వచ్చిన తరువాత ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆదివారం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నవ్య తూర్పు గోదావరి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో 41 డిగ్రీల సెల్సియస్ అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. ఏప్రిల్ మొదటి వారంలో ఇక్కడ 36 డిగ్రీలు మాత్రమే ఉండగా.. వారం రోజుల వ్యవధిలోనే మూడు డిగ్రీల ఉష్ణోగ్రత పెరగడం గమనార్హం. ఆదివారానికి తోడు భానుడి భగభగలకు నగరంలోని ప్రధాన కేంద్రాలైన కంబాలచెరువు, దేవీచౌక్, జాంపేట, కోటిపల్లి బస్టాండ్, కోటగుమ్మం, తాడితోట సెంటర్లు వెలవెలబోయాయి. రాజమహేంద్రవరం తరువాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో అత్యధికంగా 39 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రామచంద్రపురంలో 36, జిల్లా కేంద్రమైన అమలాపురంలో 35 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా కేంద్రమైన కాకినాడలో 36.3 డిగ్రీలు, తునిలో 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం పెరిగాయి. ఏప్రిల్ మొదటి వారంలో సగటున 23 డిగ్రీలుగా ఉన్న కనిష్ట ఉష్ణోగ్రతలు ప్రస్తుతం రాజమహేంద్రవరంలో 26.5, అమలాపురంలో 25.2, కాకినాడలో 24.6గా నమోదవుతున్నాయి. ఎండ వేడికి సామాన్యులు అల్లాడిపోతున్నారు. రానున్న మూడు నాలుగు రోజుల పాటు అన్ని ప్రాంతాల్లోనూ గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు రెండు మూడు డిగ్రీల చొప్పున పెరగనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. సెగలు.. భగభగలతో సామాన్యులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

విద్యా కానుక.. సమయానికి చేరాలిక

- గతానికి భిన్నంగా మండల స్టోరేజీ పాయింట్ల ఏర్పాటు
- నేటి నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర పరిశీలకుల తనిఖీ



రాయవరం: వచ్చే విద్యా సంవత్సరాన్ని మరింత సమర్థవంతంగా ప్రారంభించేందుకు ప్రభుత్వం ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభించింది. నాలుగో విడత జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్లను పాఠశాలలకు సకాలంలో అందించేందుకు ఈసారి మండల పాయింట్లను ఎంపిక చేశారు. గతానికి భిన్నంగా ఈసారి మండల పాయింట్లలోనే విద్యార్థుల వారీగా జేవీకే కిట్లను సర్దుబాటు చేసి, నేరుగా పాఠశాలలకు అందించనున్నారు. ఇప్పటికే జిల్లాలో మండల స్టాక్ పాయింట్లను గుర్తించి, జిల్లా విద్యాశాఖ అధికారులు తనిఖీలు కూడా చేపట్టారు. జేవీకే కిట్లు సక్రమంగా, సమర్థంగా అందించేందుకు జిల్లా, మండల కమిటీలు ఏర్పాటు చేశారు. ప్రతి విద్యార్థికీ పాఠశాల ప్రారంభం రోజునే కిట్ అందించేలా.. అధికారులు బాధ్యత వహించేలా చర్యలు చేపట్టారు. ఇందుకుగాను పటిష్ట ప్రణాళిక అమలు చేస్తున్నారు.

నేటి నుంచి రాష్ట్ర పరిశీలకుల తనిఖీ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో స్టోరేజీ పాయింట్ల తనిఖీకి రాష్ట్ర స్థాయి అధికారులను పరిశీలకులుగా నియమించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు రాష్ట్ర ప్రణాళిక విభాగం సమన్వయ అధికారి నిరంజన్‌కుమార్, తూర్పు గోదావరికి కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి డి.మధుసూదనరావు, కాకినాడ జిల్లాకు పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ జి.నాగమణిని పరిశీలకులుగా నియమించారు. వీరు మండల స్థాయిలో ఏర్పాటు చేసిన స్టోరేజీ పాయింట్లలో వసతి ఉందా, లేదా, విద్యుత్ సౌకర్యం ఎలా ఉన్నాయో పరిశీలిస్తారు. జేవీకేలో అందించే యూనిఫామ్, బెల్టులు, బ్యాగ్‌లు, షూస్, నోట్‌బుక్స్, డిక్షనరీలు, పాఠ్య పుస్తకాలు తదితర సామగ్రి పాడవ్వకుండా తీసుకున్న చర్యలను ప్రధానంగా పరిశీలిస్తారు. వర్షం కురిసినా జేవీకే సామగ్రి తడవకుండా ఉండేందుకు ఉన్న రక్షణ చర్యలను అంచనా వేస్తారు. అలాగే మండల టీములతో సమావేశమై, సామగ్రి పంపిణీకి సమాయత్తం చేస్తారు. మండల విద్యాశాఖాధికారి చైర్మన్‌గా స్టోరేజీ పాయింట్ పాఠశాల హెచ్‌ఎం కన్వీనర్‌గా, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం, మండల ఇంజినీరింగ్ అధికారి, సీఆర్‌పీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, ఐఈఆర్‌టీలు, ఐటీ సిబ్బంది సభ్యులుగా ఉంటారు. రాష్ట్రం నుంచి మండల స్టోరేజీ పాయింట్లకు వచ్చిన సామగ్రి నాణ్యతను ఏపీఎం, మండల ఇంజినీరింగ్ అధికారి పరిశీలించి, దిగుమతి చేసుకోవాలి. నాణ్యత లేని సామగ్రిని తిప్పి పంపేందుకు అవసరమైన చర్యలు కూడా తీసుకుంటున్నారు. మండల పాయింట్ నుంచి పాఠశాలలకు సామగ్రిని చేర్చే క్రమంలో ఒక్కో కాంపొనెంట్‌కు ముగ్గురు చొప్పున ఎనిమిది టీములు ఏర్పాటు చేశారు. సామగ్రిని కలెక్ట్ చేసే టీమ్, టీమ్ ఫర్ స్టాక్ రిజిస్టర్, ట్రాన్స్‌పోర్టేషన్ టీమ్, టీమ్ ఫర్ స్టూడెంట్ కిట్స్ ప్రిపరేషన్, రూట్ ప్లాన్ ప్రిపరేషన్ టీమ్, వెరిఫికేషన్ ఆఫ్ రిసీవింగ్ స్టాక్ టీమ్, బయోమెట్రిక్ ఆథంటికేషన్ టీమ్, డైలీ సిచ్యుయేషన్ రిపోర్టింగ్ టీమ్‌లు ఏర్పాటు చేశారు.

నేడు పర్యటించే మండలాలివీ..

రాష్ట్ర పరిశీలకులు సోమవారం నుంచి మూడు రోజుల పాటు వివిధ మండలాల్లో పర్యటించి, జేవీకే స్టోరేజీ పాయింట్లను పరిశీలిస్తారు. సోమవారం మోరి జెడ్పీ హైస్కూల్ (సఖినేటిపల్లి), మలికిపురం ఎంపీయూపీ స్కూల్, రాజోలు జెడ్పీ బాలుర హైస్కూల్, ఎంఆర్ నగరం ఎంపీపీ స్కూల్ (మామిడికుదురు), అల్లవరం, అంబాజీపేట జెడ్పీ హైస్కూళ్లు, కె.ఏనుగుపల్లిలంక ఎంపీపీ స్కూల్ (పి.గన్నవరం).


రేపు సందర్శించే పాఠశాలలు

సూర్యనగర్ జెడ్పీ బాలుర హైస్కూల్ (అమలాపురం), గొల్లవిల్లి (ఉప్పలగుప్తం), కందికుప్ప (కాట్రేనికోన), ఐ.పోలవరం జెడ్పీ హైస్కూళ్లు, ముమ్మిడివరం బాలికల జెడ్పీ హైస్కూల్, కొత్తపేట ప్రభుత్వ బాలుర హైస్కూల్, రావులపాలెం జెడ్పీ బాలుర హైస్కూల్.

12న..

లొల్ల ఎంపీపీ మెయిన్ స్కూల్ (ఆత్రేయపురం), కొత్తూరు ప్రభుత్వ హైస్కూల్ (ఆలమూరు), సీహెచ్‌ఎస్ఎంఎస్‌వీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల (మండపేట), రత్నంపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల (రామచంద్రపురం), రాయవరం, రామచంద్రపురం మండల విద్యాశాఖ కార్యాలయాలు, అంగర జెడ్పీ హైస్కూల్ (కపిలేశ్వరపురం).

కమిటీలు సిద్ధంగా ఉండాలి



మండల స్థాయిలో స్టోరేజీ పాయింట్లను గుర్తించి, ఇప్పటికే సిద్ధం చేశాం. మండల కమిటీ లు ఏర్పాటు చేశాం. జిల్లా పరిశీలకుల తనిఖీకి అవసరమైన అన్ని చర్యలూ మండల కమిటీలు తీసుకోవాలి. జేవీకే కిట్ల పంపిణీకి అవసరమైన చర్యలు పక్కా ప్రణాళికతో చేపట్టాం.

– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి

ఎంఈఓలకు మార్గదర్శకాలు



వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి జేవీకే కిట్లను విద్యార్థులకు సకాలంలో అందించేందుకు ప్రభుత్వం ఇప్పటి నుంచే చర్యలు చేపట్టింది. ఇందుకు అనుగుణంగా మండల విద్యాశాఖాధికారులకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశాం. ఈ నెల మూడు, నాలుగు వారాల నుంచే మండల స్టోరేజీ పాయింట్లకు జేవీకే సామగ్రి చేరుకుంటుంది.

– టీవీవీ సుబ్రహ్మణ్యం, జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు వేళాయె

- నోటిఫికేషన్ విడుదల
- ఈ నెల 24 దరఖాస్తుకు తుది గడువు

రాయవరం: రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. 5వ తరగతిలో ప్రవేశాలతో పాటుగా, 6,7,8 తరగతుల్లో ఖాళీలకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. తూర్పు గోదావరి జిల్లా భూపతిపాలెం వద్ద బాలురు, కాకినాడ జిల్లా తుని జగన్నాథగిరి వద్ద బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలున్నాయి. వీటిలో చేరేందుకు తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాతో పాటు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందినవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఈ రెండు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఒక్కో పాఠశాలలో 80 వంతున సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఏలూరు జిల్లాలోని అప్పలరాజుగూడెం(బాలురు), నాగిరెడ్డిగూడెం(బాలికలు) రెసిడెన్షియల్ పాఠశాలల్లో తూర్పుగోదావరి జిల్లాకు చెందినవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. కాగా 6,7,8 తరగతుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనప్పటికీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఎటువంటి ఖాళీలు లేకపోవడంతో ఆయా తరగతుల్లో ప్రవేశానికి అవకాశం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ఫస్టియర్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. పదోతరగతి చదువుతున్న విద్యార్థులు ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు, ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే వీలుంది.

రిజర్వేషన్ ఇలా

ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు సాధారణ పాఠశాలల్లో ఓసీ కేటగిరీలో 41శాతం, బీసీ–ఏ ఏడు శాతం, బీసీ–బీ 10, బీసీ–సీ 1, బీసీ–డీ 7, బీసీ–ఈ 4, ఎస్సీ–15, ఎస్టీ–6 శాతం సీట్లు కేటాయిస్తారు. ప్రత్యేక కేటగిరీ రిజర్వేషన్‌లో భాగంగా పీహెచ్‌సీ–మూడు, సైనికోద్యోగుల పిల్లలకు మూడు, అనాథలకు మూడు శాతం సీట్లు కేటాయిస్తారు.

అర్హతలివీ..

రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశానికి ఆయా జిల్లాల పరిధిలోని మండలంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2021–22 విద్యా సంవత్సరంలో మూడో తరగతి, 2022–23 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతూ ఉండాలి. ఓసీ, బీసీలకు చెందినవారు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు చెందినవారు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. జనరల్ పాఠశాలల్లో ప్రవేశానికి ఓసీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు తప్పనిసరిగా గ్రామీణ ప్రాంతంలో చదివి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చదివినప్పటికీ జనరల్, మైనారిటీ పాఠశాలల్లో ప్రవేశానికి అర్హత పొందుతారు. విద్యార్థుల తల్లిదండ్రులు/సంరక్షకుల వార్షికాదాయం(2022–23) రూ.లక్షకు మించి ఉండరాదు. లేదా తెలుపు రేషన్‌కార్డు కలిగిన వారు అర్హులు. సైనికోద్యోగుల పిల్లలకు ఆదాయ పరిమితి వర్తించదు.

దరఖాస్తు చేసుకోవాలిలా..

ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేయడానికి ఆసక్తి ఉన్నవారు హెచ్‌టీటీపీఎస్://ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలి. నియమావళిని జాగ్రత్తగా చదివి, దరఖాస్తును పూరించాలి. అభ్యర్థి అర్హత ప్రమాణాల గురించి సంతృప్తి చెందిన తర్వాత రూ.100 ఫీజును ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి. ఆన్‌లైన్ దరఖాస్తును సమర్పిస్తున్నప్పుడు ధ్రువపత్రాలు సమర్పించాల్సిన పని లేదు. అడ్మిషన్ సమయంలో ఒరిజనల్ సర్టిఫికెట్లను సమర్పించాలి.

ప్రవేశ పరీక్ష ఇలా..

5వ తరగతిలో ప్రవేశ పరీక్ష 100 మార్కులకు నిర్వహిస్తారు. తెలుగు/ఉర్దూ 25, ఇంగ్లిషు 15, గణితం 30, పరిసరాల విజ్ఞానం 30 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. 5వ తరగతికి ప్రవేశ పరీక్ష 4వ తరగతి సిలబస్ నుంచి ఇస్తారు. ప్రవేశ పరీక్ష ఆబ్జెక్టివ్ టైపులో ఉంటుంది. పరీక్షా కేంద్రాలు సంబంధిత జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేస్తారు. పరీక్షల నిర్వహణకు తూర్పుగోదావరి జిల్లాకు భూపతిపాలెం ఏపీ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ బేతపూడి రవి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు అప్పలరాజుగూడెం రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ నరసింహస్వామి, కాకినాడ జిల్లాకు తుని, ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి జిల్లా కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తున్నారు.



ముఖ్యమైన తేదీలు

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేదీ: ఏప్రిల్ 4
ఆన్‌లైన్ దరఖాస్తుకు తుది గడువు: ఏప్రిల్ 24
హాల్ టిక్కెట్ల జారీ: మే 12
పరీక్ష తేదీ: మే 20 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు
ఫలితాల ప్రచురణ,
మొదటి జాబితా ఎంపిక: జూన్ 8
రెండో జాబితా ఎంపిక: జూన్ 16
మూడో జాబితా ఎంపిక: జూన్ 23

సద్వినియోగం చేసుకోవాలి



ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న పరీక్ష పేద విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఈ విషయంలో మండల స్థాయి విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. – జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

క్లుప్తంగా

34.84 లక్షల కిలోల పొగాకు అమ్మకాలు



దేవరపల్లి వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు విక్రయాలు

దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఐదు వేలం కేంద్రాల్లో ఇప్పటి వరకు 34.80 లక్షల కిలోల పొగాకు అమ్మకాలు జరిగినట్టు పొగాకు బోర్డు రీజినల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. కిలో సగటు గరిష్ట ధర రూ.210, కనిష్ట ధర రూ.170, సగటు ధర రూ.197.13 రైతుకు లభించినట్టు ఆయన తెలిపారు. దేవరపల్లి వేలం కేంద్రంలో 6.92 లక్షల కిలోలు, జంగారెడ్డిగూడెం–1 వేలం కేంద్రంలో 9.30 లక్షల కిలోలు, జంగారెడ్డిగూడెం–2 వేలం కేంద్రంలో 7.35 లక్షల కిలోలు, కొయ్యలగూడెం వేలం కేంద్రంలో 9.56 లక్షల కిలోలు, గోపాలపురం వేలం కేంద్రంలో 5.67 లక్షల కిలోల పొగాకు అమ్మకాలు జరిగినట్టు ఆయన తెలిపారు.

సేవే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న అనాలియో

ఉండ్రాజవరం: సేవే ధ్యేయంగా బుద్ధిస్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పనిచేస్తోందని బౌద్ధ పీఠాధిపతి బంతె అనాలియో అన్నారు. బుద్ధిస్ట్ కౌన్సిల్ రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం తాడిపర్రులోని బౌద్ధ విహార్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బౌద్ధ ధర్మాల ప్రచారం చేయటయే ధ్యేయంగా అందరూ పనిచేయాలన్నారు. కరుటూరి విజయచౌదరి మాట్లాడుతూ తాడిపర్రులో విశాలమైన పచ్చని తోటల మధ్య ప్రశాంత వాతావరణంలో దమ్మ విజయ, బుద్ధ విహార్‌లను నిర్మించనున్నట్లు తెలిపారు. రావులపాలెం మండలంలో కేతరాజుపల్లిలో బుద్ధిస్ట్ కాండ్రు వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్మించనున్న బుద్ధవిహార్ గురించి చర్చించారు. కౌన్సిల్ ఆధ్వర్యంలో చేపట్టబోయే కార్యక్రమాలపై ఈ సమావేశంలో తీర్మానించారు. ప్రతినిధులు సీహెచ్ సుబ్బారావు, ఏ రామేశ్వరరావు, పి.పవన్ ప్రసాద్, ఎస్.కృష్ణారావు, వడ్డి శ్రీనివాసరావు, వివిధ జిల్లాల నుంచి బౌద్ధులు పాల్గొన్నారు.

వ్యక్తి దుర్మరణం



సత్యనారాయణ మృతదేహం

పెద్దాపురం: ఎదురుగా వస్తున్న వాహనం బలంగా ఢీ కొట్టిన సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తి జారిపడి మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి పెద్దాపురం పట్టణ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం జగ్గంపేట నుంచి ఆటోలో వస్తున్న జగ్గంపేటకు చెందిన మామిడిశెట్టి సత్యన్నారాయణ (52) స్థానిక ఎన్టీఆర్ నగర్ అపార్ట్‌మెంట్స్‌కు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న కారు అదుపు తప్పి బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రయాణికుడు సత్యనారాయణ ఆటో నుంచి జారి పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించినప్పటికీ మార్గమధ్యలోనే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్‌ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాలు ఢీకొని..

ఆత్రేయపురం: మండల పరిధిలోని లొల్లలాకుల వద్ద కట్టుంగ వెళ్లే దారిలో ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో మానేపల్లి సత్యనారాయణ (53) మృతి చెందాడు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం కట్టుంగకు చెందిన మృతుడు సత్యనారాయణ తన బైక్‌పై ఇంటికి వెళుతుండగా ఎదురుగా వస్తున్న రావులపాలెం మండలం రావులపాడుకు చెందిన మల్కా నాని బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందగా నానికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు ఎస్సై సీహెచ్.సుధాకర్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సేవలకు అమెరికన్ ప్రెసిడెంట్ అవార్డు



అమెరికా అధికారుల నుంచి అవార్డు అందుకున్న సరయు

యానాం: చిన్ననాటి నుంచే స్వచ్ఛంద సేవాకార్యక్రమాలు చేయడం ఆమెకు చాలా ఇష్టం. ఆ విధంగా అమెరికా దేశంలో అత్యవసర సమయాల్లో ఆమె స్వచ్ఛందంగా చేసిన వివిధ సేవా కార్యక్రమాలను ఆ దేశ అధ్యక్షుడు జో బైడెన్ మెచ్చి ఆమెకు వైట్ హౌస్ ద్వారా 2022 ఏడాదికి గాను ప్రెసిండెంట్ గోల్డ్ వలంటీర్ సర్వీసెస్ అవార్డును ఆదివారం ప్రదానం చేశారు. వివరాల్లోకి వెళితే..యానాం కనకాలపేటకు చెందిన బత్తిన వెంకట్, సింధూర దంపతులు గ్రీన్‌కార్డు హోల్డర్స్ అమెరికాలోని చికాగోలో నెప్రెవెల్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా చాలాకాలం క్రితం స్థిరపడ్డారు. వారి కుమార్తె సరయు చిన్నప్పటి నుంచి అమెరికాలో వివిధ స్వచ్ఛందసేవా కార్యక్రమాలు చేస్తోంది. ఆమె మెడికల్ పరంగా అందిస్తున్న సేవా కార్యక్రమాలు బాగా ప్రాచుర్యం పొందాయి. దీంతో ఆమె సేవలు వైట్‌హౌస్ దృష్టికి వెళ్లాయి. దీంతో ఆమె సమయం, సేవాభిరుచిని దేశానికి సహాయం చేసేందుకు వెచ్చించారని, అనేక సవాళ్లను దీటుగా ఎదుర్కొన్నారని సరయుకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ రాసిన లేఖలో పేర్కొన్నారు. అమెరికా పౌరులు ఆమె సేవలను ప్రశంసిస్తున్నారని రాశారు. ఈ సందర్భంగా ఆమెకు వైట్ హౌస్ ద్వారా ది ప్రెసిండెంట్ వలంటరీ సర్వీస్ గోల్డ్ అవార్డును అధికారులు అందించారు. సరయు ప్రస్తుతం మెడిసిన్ చదివేందుకు సిద్ధమవుతోందని, మొదటి నుంచి సేవలు అందించడం ఇష్టమని ఆమె తాత, మాజీ యానాం మార్కెటింగ్ చైర్మన్ కోన కొండబాబు తెలిపారు.

● ఈ గుత్తు మరీ గమ్మత్తు!



మామిడికుదురు: ఒకే రెమ్మకు 20 కాయలతో పనస చెట్టు ఆకట్టుకుంటోంది. మామిడికుదురులో తోరం సత్యనారాయణ ఇంటి పెరట్లో చెట్టుకు అడుగు ఎత్తులో ఒకే రెమ్మకు భారీగా పనస కాయలు కాయడం అబ్బుర పరుస్తోంది. సాధారణంగా ఒక రెమ్మకు అయిదు కాయలు ఉండడం సహజమని, దానికి భిన్నంగా 20 కాయలు కాయడం అద్భుతమని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ పనస కాయల గుత్తును స్థానికులు విచిత్రంగా చూస్తున్నారు.

● అపూర్వ బంధం



రాజోలులో కలుసుకున్న 1962-63 బ్యాచ్ విద్యార్థులు

అరవై ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు

రాజోలు: వారంతా ఏడు పదులు వయసు దాటిన వారే. అరవై ఏళ్ల తర్వాత స్నేహితులంతా ఒకచోట కలిశారు. 1962–63 సంవత్సరంలో రాజోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి నుంచి ఎస్ఎస్ఎల్‌సీ వరకు చదివారు. ఆదివారం జరిగిన ఆ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు రాజోలు వచ్చారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆలింగనం చేసుకుని పాత జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. అనాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయుల చిత్రపటాలకు నమస్కరించారు. స్నేహితులంతా ఒకచోట కలిసే సరికి వారంతా తరగతి గదుల్లో జ్ఞాపకాలు, చిలిపి చేష్టలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. ఈ సమ్మేళనం ఏర్పాటు చేసిన పాపయ్యపంతులుకు పూర్వ విద్యార్థులు అభినందనలు తెలిపారు.

108 మంది దంపతులతో గణపతి హోమం

మహాకాళేశ్వరాలయంలో వైభవంగా నిర్వహణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట కైలాసభూమి సమీపంలోని మహాకాళేశ్వరాలయం(మరోఉజ్జయిని) ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నాలుగవ రోజు ఆదివారం 108 మంది దంపతులు సామూహిక గణపతిహోమం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి గణపతిపూజ, గోపూజ, మంటప పునఃపూజలు, రుద్రహోమం, నవగ్రహ హోమం, నీరాజన మంత్రపుష్పాలు, వేదస్వస్తి నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారని వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టపగలు వెంకటరావు తెలిపారు. సోమవారం ఉదయం నుంచి గణపతిపూజ, గోపూజ, రుద్రాభిషేకం, అన్నాభిషేకం, మంటపాల పునఃపూజలు, మహాపూర్ణాహుతి, అన్నసమారాధన, సాయంత్రం 05.00గంటలకు శాంతి కల్యాణం నిర్వహిస్తామని ఆలయ అర్చకులు ఆదిత్య తెలిపారు.



మహాకాళేశ్వరాలయంలోని కాళీమాతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

7న ఆర్యవైశ్యుల ఆత్మీయ కలయిక



కొత్తపేటలో చర్చిస్తున్న జిల్లా, రాష్ట్ర ఆర్యవైశ్య పెద్దలు

కొత్తపేట: రాజమహేంద్రవరంలో వచ్చే నెల 7న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల 'ఆర్యవైశ్యుల ఆత్మీయ కలయిక' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా, రాష్ట్ర ఆర్యవైశ్య పెద్దలు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన కొల్లూరి చినబాబు, కోరుప్రోలు వెంకటేశ్వరరావు, కంచర్ల చిన్నవీరభద్రరావు, పల్లపోతు బంగారం, కంచర్ల ప్రసాద్, మానేపల్లి శ్రీనివాస్ తదితర పెద్దలు ఆదివారం స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కలాణ మంటపంలో స్థానిక ఆర్యవైశ్య పెద్దలతో సమావేశమయ్యారు. రాజకీయాలకు, సంఘాలకు అతీతంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో తీర్మానించే పలు అంశాలను చర్చించారు. ప్రధానంగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు ఐదు లక్షల మంది ఆర్యవైశ్యులం ఉన్నామని, అయితే తమ కులానికి తగిన గుర్తింపు లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో తగిన రాజకీయ ప్రాతినిధ్యం పొందే లక్ష్యంతో తమ సంఖ్యా బలానికి అనుగుణంగా అన్ని గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో తరలివచ్చి తమ ఉనికి చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఇంకా ఆర్యవైశ్య కులం నుంచి వివిధ మంత్రివర్గాల్లో మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా పనిచేసిన కొణిజేటి రోశయ్య పేరున స్మృతివనం నిర్మాణం, ప్రత్యేక పోస్టల్ స్టాంపు విడుదల తదితర డిమాండ్లను ప్రభుత్వాల ముందుంచి సాధించాలన్నది ఈ ఆత్మీయ కలయిక లక్ష్యమని చెప్పారు. స్థానిక ఆర్యవైశ్య పెద్దలు సత్యవరపు జమీందార్, శ్రీఘాకోళ్లపు బాబి, డాక్టర్ పి.కృష్ణారావు, శ్రీఘాకోళ్లపు రాధాకృష్ణ, తమ్మన సాయిప్రసాద్, గమిడి ఆనంద్, సత్యవరపు శ్రీనివాసరావు, తమ్మన రమేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

పోక్సో కేసు నమోదు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురానికి చెందిన మైనర్ బాలికపై అత్యాచారం చేసిన మద్రే అబ్రహంపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్సై కె.శుభశేఖర్ అదివారం తెలిపారు. ఈ నెల 5వ తేదీ తెల్లవారుజాము నుంచి తన కుమార్తె కనిపించడం లేదని ఈ నెల 7న చెరుకూరి మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు. మద్రే అబ్రహం మోటారు సైకిల్‌పై బాలికను మారేడుమిల్లి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడన్నారు. కేసును నార్త్‌జోన్ డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు దర్యాప్తు చేస్తారని ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



సూరిబాబు మృతదేహం

కాజులూరు: కాజులూరులో విద్యుదాఘాతానికి గురై కొత్తమంజేరుకు చెందిన మాసగిరి సూరిబాబు(30) మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజులూరు కృష్ణుడి గుడి సెంటరులో గల కాదా శివకుమార్ చికెన్ సెంటరులో కొత్తమంజేరుకు చెందిన మాసగిరి సూరిబాబు రెండు సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. ఆదివారం కోళ్లను డ్రస్సింగ్ చేసే బాయిలర్ మెషీన్ ఆన్ చేస్తుండగా మెషీన్‌కు విద్యుత్ సరఫరా జరగటంతో షాక్‌కు గురై మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గొల్లపాలెం పోలీస్ స్టేషన్ ఎస్సై ఎస్.తులసీరామ్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మాజీ, మహిళా పోలీస్ బామరాజు శవ పంచనామా నిర్వహించారు.

యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడ్డ సాయిప్రవీణ్(23)

యానాం: యానాంలో యువకుడు ఆదివారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ పరిధిలోని మెట్టకూరు మదర్ థెరిసా కాలనీకి చెందిన బొజ్జా సాయిప్రవీణ్(23) తన స్వగృహంలో ఫ్యాన్‌కు చీర బిగించి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి అతనిని యానాం జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు గాడిమొగలో ఎల్‌అండ్‌టీ కంపెనీలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడన్నారు. మృతునికి తల్లి, తండ్రి, చెల్లి ఉన్నారన్నారు. మృతికి గల కారణాలను విచారిస్తున్నామన్నారు. ఎస్సై శేరు నూకరాజు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

ప్రత్తిపాడు: మద్యం మత్తులో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని లంపకలోవ గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానిక పోలీసుల కథనం మేరకు లంపకలోవ గ్రామానికి చెందిన ఆముదాల శ్రీను (35) మద్యం మత్తులో తన ఇంటిలో ఆత్మహత్య చేసుకున్నాడు. తన ఇంటిలోకి వెళ్లి తలుపునకు గెడ పెట్టుకుని, చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. భార్య అంధురాలు కావడంతో సాయంత్రం వరకు ఈ విషయం తెలియలేదు. మృతునికి కుమారుడు, కుమార్తె సంతానం. బంధువులు కిటికీ నుంచి చూడగా, వేలాడుతున్న శ్రీనును గమనించారు. తలుపులు రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తలుపులు పగులగొట్టి, మృత దేహాన్ని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. మృతుని తండ్రి ఆముదాల మాణిక్యం ఇచ్చిన ఫిర్యాదుపై ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల నుంచి తప్పించుకోబోయి కాలువలో పడి మృతి

- కోడిపందేల శిబిరంపై దాడి
- పారిపోతుండగా ప్రమాదం



మృతుడు నహేష్ (ఫైల్)

మధురపూడి: కోరుకొండ మండలం బుచ్చెంపేట తొర్రిగెడ్డ కాలువలో పడి బత్తుల నహేష్ (29) ఆదివారం మృతిచెందాడు. కోరుకొండ పోలీసు స్టేషన్ ఎస్సై కట్టా వారదా సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. స్థానిక బుచ్చెంపేట–గుమ్ములూరు– కాపవరం శివారు ప్రాంతంలో కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో పరుగెత్తుతూ కాలువలో పడి నహేష్ మృతి చెందాడు. కోరుకొండకు చెందిన నహేష్ కారులో గుమ్ములూరు రోడ్డుకు వెళ్లాడు. బూరుగుపూడి శివారులో సామిల్లు సమీపంలో కారును పార్క్ చేసి, మోటార్ సైకిళ్లపై పందేలు నిర్వహించే ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ కోడి పందాలాడుతుండగా పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. వారి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో చాలా దూరం పరుగులు తీశాడు. కాని తనను అనుసరిస్తున్న పోలీసులకు దొరక్కుండా పారిపోతుండగా కాలువలో పడిపోయాడు. ఏడు అడుగుల లోతు ఉండటంతో అదే చోట పందేలాడుతున్న వారి సహకారంతో కాలువలో నుంచి నహేష్‌ను బయటకు తీశారు. 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కోరుకొండ సామిల్లు యాజమాని, వ్యాపారస్తుడైన నహేష్ మృతితో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. నహేష్ తండ్రి కొంతకాలం క్రితం మృతి చెందారు. మృతుడికి తల్లి, సోదరి ఉన్నారు. ఈ ఘటనలో రూ.250, రెండు కోళ్లు, కత్తులు స్వాధీనం చేసుకొని, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నారని ఎస్సై తెలిపారు.

ఫోన్ పేతో వ్యాపారికి టోకరా

రాయవరం: ఈజీ మనీకి అలవాటు పడిన కొందరు మోసగాళ్లు ప్రజలను ఏ విధంగా మోసగించాలా అనే ఆలోచనతో ఉంటున్నారు. పలువురు ఆ మోసగాళ్ల వలలో చిక్కుకుని ఆర్థికంగా నష్టపోతున్నారు. అదే కోవలో రాయవరం మండలం పసలపూడికి చెందిన తేతలి వీర్రెడ్డిని ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ పే ద్వారా మోసగించారు. ఈ నెల 7న ఇరువురు గుర్తు తెలియని వ్యక్తులు వీర్రెడ్డి నిర్వహిస్తున్న కిరాణా షాపులో రూ.3,200 విలువైన ఆయిల్ డబ్బాలు కొనుగోలు చేశారు. ఆ సొమ్మును ఫోన్ పే స్కానర్ ద్వారా స్కాన్ చేసినట్టుగా మెసేజ్ చూపించి వెళ్లిపోయారు. ఎంతసేపటికి తన అకౌంట్‌కు డబ్బులు జమ కాకపోవడంతో మోసపోయినట్టుగా గ్రహించిన వ్యాపారి వీర్రెడ్డి రాయవరం పోలీసులను ఆశ్రయించాడు. వ్యాపారి వీర్రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ తెలిపారు.